క్లుప్తంగా

యువకుని ఆత్మహత్య

కనిగిరి రూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘట శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ వీధిలో మూడో అంతస్తు భవనంలోనిపై ఇంటిలో అద్దంకికి చెందిన ఓ యువకుడు గత ఆరు నెలల నుంచి అద్దెకు ఉంటున్నాడు. సాయంత్రం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. లోపలి నుంచి గడి వేసుకుని ఉండటం, దుర్వాసన వస్తుండటంతో ఇంట్లో దుర్ఘటన జరిగినట్లు భావిస్తున్నారు. యువకుడు డీఎస్సీ కోచింగ్‌కు కనిగిరికి వచ్చినట్లు తెలిసింది. యువకుని పేరు సురేష్ (35)గా భావిస్తున్నారు. ఎస్సై దాసరి ప్రసాద్‌ను వివరణ కోరగా ఇంట్లో నుంచి దుర్వాసన వస్తోందని.. ఇంటి తాళం శనివారం పగులగొట్టి పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

సింగరాయకొండ: స్థానిక సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల హాస్టల్(కాలేజీ) వార్డెన్ ఎస్‌వీ జగదీశ్వరిని సస్పెండ్ చేస్తూ ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీఓ షేక్ జమీఉల్లా తెలిపారు. వసతి గృహం నిర్వహణ తీరు, విద్యార్థినుల ఆరోపణలపై పత్రికల్లో వచ్చిన కథనాలు, తహసీల్దార్ సీహెచ్ ఉష, ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, సోషల్ వెల్ఫేర్ డీడీ యు.దానయ్య ఇచ్చిన సంయుక్త నివేదిక ఆధారంగా వార్డెన్‌ను సస్పెండ్ చేశారని వివరించారు. అలాగే వసతి గృహంలోని విద్యార్థినులను మండల కాంప్లెక్స్‌లోని బీసీ కాలేజీ బాలికల హాస్టల్‌కు మార్చడంతోపాటు అక్కడి వార్డెన్‌నే వీరికి ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని, ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని ఎంపీడీఓ పేర్కొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లు పరిశీలిస్తున్న తహసీల్దార్

హనుమంతునిపాడు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్‌లను శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఎస్. హరిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా 16, 28 నంబర్ గల పోలింగ్ బూత్‌లల్లో అన్ని వసుతులు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. మండలంలో పట్టభద్రులు 634 మంది, ఉపాధ్యాయులు 19 మంది ఓటు వినియోగించుకుంటారన్నారు.

వ్యక్తిపై కత్తి తో దాడి

ఉలవపాడు: ఇంటికి వెళుతున్న వ్యక్తి పై ఇద్దరు కత్తి తో దాడి చేయడంతో తలకు గాయం అయిన సంఘటన మండల కేంద్రమైన ఉలవపాడులోని కృష్ణ నగర్ లో శుక్రవారం రాత్రి జరిగింది. కొల్లూరుపాడు గ్రామానికి చెందిన అమ్మనబ్రోలు రవి కృష్ణనగర్ లోని ఓ సెల్ షాపులో ఉన్న సమయంలో ఉలవపాడు గ్రామానికి చెందిన కోటుశివకృష్ణ, వాక కు చెందిన ఎండేటి వెంకటేశ్వర్లు కత్తితో గాయపరచడంతో తలకు గాయం అయింది. వెంటనే ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాల కు తరలించారు. సంఘటనా స్థలిని ఎస్సై త్యాగరాజు పరిశీలించారు. గతంలో ఇద్దరి మధ్య ఉన్న పాత గొడవల కారణంగా ఈ దాడి జరిగినట్లు తెలియచేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

టంగుటూరు: సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన సంఘటన ప్రియాంక వే బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జాతీయ రహదారిపై ప్రియాంక వే బ్రిడ్జి ఎదురుగా సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు అదుపుతప్పి బలంగా ఢీకొనగా గుర్తుతెలియని వ్యక్తికి బలమైన రక్తగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై ఖాదర్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రుడిని 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టంగుటూరు: టంగుటూరు 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖ రూరల్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. జమ్ములపాలెం, టంగుటూరు టౌను, కాకుటూరివారిపాలెం, జయవరం, ఎం.నిడమానూరు, కారుమంచి, మర్లపాడు, టోల్ ప్లాజా, తూర్పునాయుడుపాలెం, మల్లవరప్పాడు, శివపురం, సూరారెడ్డిపాలెం, వల్లూరు, వాసేపల్లిపాడు, రాయివారిపాలెం, పసుకుదురు, కేసుపాలెం, వెలగపూడి, అనంతవరం, ఆలకూరపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు, రైతులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

దాతల సహకారంతో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట



హాజరైన విద్యార్థులు

- విద్యార్థులతో ఎమ్మెల్యే మానుగుంట
- ఘనంగా ఉలవపాడు జూనియర్ కళాశాల వార్షికోత్సవం

ఉలవపాడు: విద్యార్థులు మంచి ఫలితాలు తీసుకువస్తారనే ఆశతోదాతలు ఈ కళాశాల అభివృద్ధి అండగా ఉంటున్నారని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అన్నారు. శుక్రవారం ఉలవపాడులోని జీవీయస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన 45వ వార్షికోత్సవ సభలో మాట్లాడారు. విద్యార్థులు ఇబ్బంది పడకూడదని దాతల సహకారంతో మధ్యాహ్న భోజన పథకం అందిస్తున్నట్లు తెలిపారు. దాతలు వచ్చే ఏడాది కూడా ఈ పథకం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో డిజిటల్ క్లాస్ రూం కూడా దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు మీకోసం పడుతున్న బాధను గుర్తించలేకుంటే భవిష్యత్తు శూన్యం అవుతుందన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంపీడీఓ చెంచమ్మ, ఎస్సై త్యాగరాజు, శింగరాయకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఉలవపాడు ప్రిన్సిపాల్ జిలానీ బాషా, హేచరీ సిబ్బంది పాల్గొన్నారు.

9 నుంచి వేలం ప్రారంభం



వేలం కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న బోర్డు ఉన్నతాధికారులు

కందుకూరు: మండల పరిధిలో మార్చి 9 నుంచి ఎస్ఎల్ఎస్ పరిధిలోని వేలం కేంద్రాల్లో పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభమవుతుందని పొగాకు బోర్డు ఆక్షన్ మేనేజర్, ఇన్‌చార్జి కార్యదర్శి దివి వేణుగోపాల్, ప్రొడక్షన్ మేనేజర్, ఆర్ఎం కృష్ణశ్రీ తెలిపారు. శుక్రవారం కందుకూరులోని ఒకటి, రెండో వేలం కేంద్రాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వేలం ప్రారంభానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై స్థానిక అధికారులకు సూచనలు చేశారు. అనంతరం బోర్డు సిబ్బందితో సమావేశం నిర్వహించి అధికారులు రైతులకు అన్ని సమయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులు ఎదుర్కొనే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రైతులు కూడా పొగాకు మండెలను ఎప్పటికప్పుడు తిప్పడం వల్ల నాణ్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. అలాగే క్యూరింగ్ సమయంలో బ్యారన్‌లో క్యూరో మీటర్ ఉపయోగించడం వల్ల అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. అలాగే పొగాకు కొట్టేటప్పుడు, గ్రేడింగ్ చేసే సమయంలో పొగాకు అన్యపదార్థాలు పొగాకులో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతేడాది మాదిరే ఈ ఏడాది కూడా రైతులకు మంచి లాభాలు రావాలని వారు ఆకాంక్షించారు. అనంతరం వేలం కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటారు. వేలం నిర్వహణాధికారి రాజగోపాల్, క్షేత్రాధికారి ఉపేంద్ర, అకౌంటెంట్ సంతోష్‌కుమార్, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



చిర్రికూరపాడులో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి గ్రంధి మాధవి

జరుగుమల్లి(సింగరాయకొండ): జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను వేగవంతం చేసి ఉగాది నాటికి ఇళ్లల్లో చేరాలని మండల ప్రత్యేకాధికారి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గ్రంధి మాధవి లబ్ధిదారులకు సూచించారు. జరుగుమల్లి మండలంలోని చిర్రికూరపాడు జగనన్న లేఅవుట్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఉగాది నాటికి 14 గృహాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకోగా ప్రస్తుతం 3 గృహాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 11 ఇళ్లు చివరి దశలో ఉన్నాయని చెప్పారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ, హౌసింగ్ డీఈ పి.జయరావు, పంచాయతీ కార్యదర్శి గీత పాల్గొన్నారు.

సింగరాయకొండ: ఉగాది నాటికి జగనన్న కాలనీలో గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉండాలని హౌసింగ్ ఏఈ సీహెచ్ నాగరాజు సూచించారు. మండలంలోని పాకల జగనన్న కాలనీని శుక్రవారం ఆయన పరిశీలించారు. లేఔట్లో 272 మందికి పట్టాలు ఇవ్వగా, 120 గృహాల నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఉగాది నాటికి 34 ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకోగా ప్రస్తుతం 18 పూర్తయ్యాయని, 16 చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి షేక్ సుబానీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవీంద్ర పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు త్వరలోనే మరమ్మతులు



పైప్‌లైన్ దెబ్బతినడంతో లేఔట్‌లో బురదమయంగా మారిన ప్రాంతం

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని పకీరుపాలెంలో జగనన్న కాలనీ లేఔట్‌లో మంచినీటి పైపు లైనుకు త్వరలోనే మరమ్మతులు చేస్తామని ఈఓఆర్డీ ఎం.అంజలీదేవి తెలిపారు. పైపు పగలడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల నుంచి ఆరోపణ రావడంతో ఈఓఆర్డీని వివరణ కోరగా.. సమస్య తన దృష్టికి వచ్చిందని వెంటనే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

జరుగుమల్లి(సింగరాయకొండ): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి, వాటి ద్వారా పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవాలని పంచాయతీ కార్యదర్శి పీవీ నారాయణకు ఎంపీడీఓ పి.రామకృష్ణ సూచించారు. జరుగుమల్లి మండలంలోని దావగూడూరు పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీరడంతోపాటు పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని, అలాగే పంటలకు ఎరువు లభిస్తుందని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఈఓఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర కేజీ రూ.200

- తొలిరోజు వేలంలో 18 బేళ్లు కొనుగోలు



కొండపిలో వేలం నిర్వహిస్తున్న బోర్డు అధికారి

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో అత్యధిక ధర కేజీ రూ.200 పలికింది. వేలం కేంద్రం పరిధిలోని జువ్విగుంట నుంచి రైతులు 18 బేళ్లు తీసుకొచ్చారు. బేళ్లను కాటా వేసిన అనంతరం వేలం కేంద్రం అధికారి రామారావు కొనుగోళ్లను ప్రారంభించారు. రైతులు వేలానికి ఉంచిన బేళ్లన్నీ అత్యధిక ధర కేజీ రూ.200 వద్ద అమ్ముడుపోయాయి. కాగా తొలిరోజు వేలంలో ఐటీసీ, జీపీఐ కంపెనీలతో పాటు మరో మూడు పొగాకు కంపెనీలు పాల్గొన్నాయి. టుబాకో బోర్డు మెంబర్ బొడ్డపాటి బ్రహ్మయ్య మాట్లాడుతూ.. ఈ ఏడాది పెట్టుబడి భారం పెరిగినందున సరాసరి ధర కేజీకి రూ.230 ఇస్తేనే గిట్టుబాటు అవుతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం నాయకుడు కేజీ మస్తాన్ డిమాండ్ చేశారు. తొలిరోజు పొగాకు కొనుగోళ్లను వేలం కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల రైతులు ఆసక్తిగా పరిశీలించారు.

జిల్లా అధ్యక్షునికి సత్కారం



మేకల చిన్న తిరుపతయ్యను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీఎస్‌పురం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పని చేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ స్టేట్ యూనియన్ కార్పొరేషన్ (టీయూసీ) జిల్లా అధ్యక్షుడు మేకల చిన్నతిరుపతి బాలు అన్నారు. వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుల ఎంపికలో భాగంగా మండలంలోని కొండ్రాజుపల్లి గ్రామానికి చెందిన మేకల చిన్న తిరుపతి బాలును టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా మండలంలోని పలువురు నాయకులు శుక్రవారం స్థానిక డీజీపేట రోడ్డులోని గంగమ్మ గుడి వద్ద చిన్నతిరుపతి బాలుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సైతం బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని మరోసారి రుజువైందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కనిగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇండ్ల బాలయ్య, నన్నసాని గుంటియ్య, ఎలికా శ్రీనివాసులు, కుక్కల రమణయ్య, గోళ్ల తిరుపతయ్య, ఆలా లక్ష్మయ్య, నన్నసాని కృష్ణమూర్తి, మాల్యాద్రి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం జరిగిందని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీ వర్గాలను అక్కున చేర్చుకున్న ఏకైక నాయకుడన్నారు. 136 కులాలకు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి పదవులు ఇచ్చారన్నారు. మంత్రి వర్గంలో 11 మంది బీసీలకు, 5 మంది ఎస్సీలకు, ఒక మైనార్టీకి స్థానము కల్పించారన్నారు. తాజాగా ఏర్పడిన 18 ఎమ్మెల్సీ స్థానాలకు గాను 14 స్థానాలు బీసీ, ఎస్సీ ఎస్టీలకు, మైనార్టీలకు కేటాయించారని కొనియాడారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 70 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు ఉన్నారన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంఈఓ పెద్దిరాజు, ఎస్సై క్రిష్ణపావని

హనుమంతునిపాడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 70 మందికి మండల దివ్యాంగుల సంఘ నాయకులు, ఆర్ఎంపీ సానికొమ్ము వెంకటేశ్వర్‌రెడ్డి చేకూర్చిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఎంఈఓ జి.పెద్దిరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్‌ను అందించినదుకు దాత వెంకటేశ్వర్‌రెడ్డికి స్థానిక ఎస్సై జి.క్రిష్ణపావని, హెచ్ఎం జీవీ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు అభినందులు తెలిపారు.

చెరువునీరు వృథా చేయడంపై ఆగ్రహం



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పామూరు: మండల కేంద్రంతో పాటు పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామానికి నీటి కష్టాలు తీర్చే పామూరు పాతచెరువు నీటిని వృథాగా వదలడంపై సీపీఐ, ఏఐటీయూసీ, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైతులు, గోపాలపురం గ్రామస్తులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పాలపర్తి మస్తాన్‌రావులు మాట్లాడుతూ చెరువులోని నీరు వృథాగా పోతోందని.. పంచాయతీ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదన్నారు. చెరువులోనీరు తగ్గిపోతే వచ్చే వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అధికారులు తక్షణం నీటి వృథాను అరికట్టాలని.. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పార్టీ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, రాగిపాటి సూరిబాబు, ఇర్రి వెంకటరెడ్డి, ఇండ్ల నరసింహారావు, ఆకుల మోహన్‌రావు, ఇర్రి రమణారెడ్డి, చీమలదిన్నె మాలకొండయ్య, దేవండ్ల సురేష్, వెలగపూడి ప్రసాద్, సత్తార్ పలువురు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా బోధన



పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఎస్ఓ

మర్రిపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఉదయభాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని చిటంకూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో నాడు–నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ ఈవీ రంగయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఎస్‌కే నాగూర్‌వలి, ఏపీఎం రాంబాబు, హెచ్ఎం యూవీ సుజాత, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పాల ఉత్పత్తిపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుదీప

మర్రిపూడి: జగనన్న పాల వెల్లువ కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించి పాల ఉత్పత్తిని పెంచాలని ఎంపీడీఓ ఎస్.సుదీపా తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గేదెలకు సబ్సిడీపై పంపిణీ చేసే దాణా, పెరిగిన ధరలు, పాల ఉత్పత్తిపై పశుపోషకులకు అవగాహన కల్పించాలన్నారు. మర్రిపూడి, కూచిపూడిలో వర్మీ కంపోస్టు ఉపయోగాలను గ్రామస్తులకు వివరించాలని సూచించారు. కాకర్ల, మర్రిపూడి గ్రామాల్లోని ప్రభుత్వ వైద్యశాలలకు కాన్పుల కోసం వచ్చేలా గర్భిణులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగూర్‌వలి, ఏఓ ఖాశింపీరా, పశు వైద్యాధికారిణి శ్రావణి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంగీత, ఆర్ఐ గోపి, ఏపీఎం రాంబాబు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లకు రూ.30 వేలు జరిమానా



ఇసుక ట్రాక్టర్లతో సెబ్ ఎస్సై దయాకర్

సింగరాయకొండ: అక్రమంగా పాలేరు నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లకు సెబ్ అధికారులు రూ.30 వేల జరిమానా విధించారు. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామున కలికవాయ పంచాయతీలోని కలికవాయ చెరువు సమీపంలో చోటుచేసుకుంది. సెబ్ ఎస్సై దయాకర్ కథనం మేరకు.. సింగరాయకొండకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు నాగేశ్వరరావు, నాగేంద్ర జరుగుమల్లి మండల పరిధిలోని పాలేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సెబ్ అధికారులు దాడి చేశారు. వీటిలో ఒక ట్రాక్టరు రెండోసారి పట్టుబడటంతో రూ.20 వేల జరిమానా, మరో ట్రాక్టరుకు రూ.10 వేల జరిమానా విధించారు.

వినికిడి యంత్రం పంపిణీ



వినికిడి యంత్రం అందజేస్తున్న నాయకులు

టంగుటూరు: స్థానిక శ్రీనివాస నగర్ చెందిన కుంచాల పిచ్చయ్యకు ప్రభుత్వం మంజూరు చేసిన వినికిడి యంత్రాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి అశోక్‌బాబుకు తన సమస్య తెలియజేయగా ఉన్నతాధికారులతో మాట్లాడి వినికిడి యంత్రాన్ని మంజూరు చేయించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు టంగుటూరి రామకృష్ణ కొమ్ము సురేంద్ర, దాసరి సుబ్బారావు, మన్నం వెంకయ్య, వికలాంగుల సంఘ జిల్లా నాయకుడు రాజేష్, ఎంపీటీసీ ప్రభుదాసు, బాలు, పాకల సుబ్బారావు, కొమ్ము బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

సింగరాయకొండ: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని వైద్యాధికారి చైతన్యకృష్ణ పేర్కొన్నారు. స్థానిక బీసీ కాలేజీ బాలికల వసతి గృహంలో ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఐదుగురు విద్యార్థినులకు మందులు అందజేశారు. హాస్టల్ వార్డెన్ సుజాత, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌ఆలీ, ఎంఎల్‌హెచ్‌పీ కుష్బూ, మహిళా పోలీసు భారతి, ఏఎన్ఎం నసీమున్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి



సూరసాని మోహన్‌రెడ్డి

కనిగిరి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి అన్నారు. తన నియామకానికి ఎంతో కృషి చేసిన ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్‌కు, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసుల రెడ్డికి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. మోహన్‌రెడ్డికి పదవీ ఇవ్వడం పట్ల ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

భూ రీసర్వే వేగవంతం చేయండి

సీఎస్‌పురం: భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఎ. బాలకిషోర్ అన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా మండలంలోని కోమటిగుంట్ల రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీసర్వేను శుక్రవారం పరిశీలించారు. రెవెన్యూ పరిధిలో ఎంత మేర భూమి ఉంది, ఇప్పటి వరకు ఎంత మేర సర్వే పూర్తి చేశారు? ఏవైనా పెండింగ్ సమస్యలు ఉన్నాయా తదితరాల గురించి తెలుసుకున్నారు. వీఆర్వోలు అజయ్, సుధాకర్, ఖాజావలి, సర్వేయర్లు జీవిత, రమ్య ఉన్నారు.

రేపటి నుంచి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



మాట్లాడుతున్న కుందురు తిరుపతిరెడ్డి, వేదికపై దేవకి వెంకటేశ్వర్లు

కనిగిరి రూరల్: స్థానిక కేటీఆర్ స్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతాయని కేటీఆర్ విద్యా సంస్థల చైర్మన్, దేవస్థాన ధర్మ కర్త కుందురు తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తన చిరకాల కోరిక అయిన దేవాలయ నిర్మాణాన్ని భగవంతుని దయతో, విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపా నందేంద్ర సరస్వతి పీఠం ఉత్తరాధికారి అయిన శ్రీ స్వాత్మా నందదేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులతో కనిగిరి ప్రాంత ప్రజల అభిమానాలతో పూర్తి చేశానన్నారు. వచ్చే నెల 3వ తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో భక్తులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటి వరకు లేని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని సొంత నిధులతో ఏర్పాటు చేసినందుకు కుందురు తిరుపతిరెడ్డిని అభినందించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి శ్రీనివాసులు, బి. రమేష్, కొలిపర్తి వెంకట స్వామి పాల్గొన్నారు.